పెండింగ్ పనులకు మోక్షం కలిగేనా!

- నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల వినియోగం
- 27తో ముగియనున్న కార్పొరేటర్ల పదవీకాలం


మున్సిపల్ కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశం మేయర్ దండు నీతూ కిరణ్ అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశం ఆరు నెలల తర్వాత నిర్వహిస్తున్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనలు, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను చర్చించి వెంటనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. చివరి సమావేశం జూన్ 2024న జరిగింది.

మాస్టర్ ప్లాన్ అమలయ్యేనా..

నిజామాబాద్‌లో మాస్టర్ ప్లాన్ కోసం గత ప్రభుత్వం డ్రాఫ్టును సిద్ధం చేసింది. అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపి చేతులు దులుపుకొన్నారు. మాస్టర్ ప్లాన్ అమలైతే నగర రూపురేఖలు మారిపోతాయి.

అసంపూర్తిగా పనులు

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అసంపూర్తిగా మిగిలిపోయింది. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అంతర్గత లైన్లు, ప్రధాన డ్రైనేజీలకు కనెక్షన్ ఇవ్వలేదు. అవుట్‌లెట్ ఇతర పనులు పూర్తిచేశారు. నిధుల లేమితో యూజీడీ పనులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయి. యూజీడీ పనుల పూర్తిపై కూడా సభ్యులు లేవనెత్తనున్నారు.

మార్కెట్ల వినియోగం ఎప్పుడో..

నగరవాసులకు అందుబాటులో ఉండేందుకు విశాలమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించారు. కానీ వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. బోధన్ బస్టాండ్ వెనుక ఉన్న అహ్మదీబజార్‌లో 101 షెటర్లతో నిర్మించిన భవనం వృథాగా ఉంది. ఖలీల్‌వాడీలో నిర్మిస్తున్న మార్కెట్ సైతం అసంపూర్తిగా ఉంది.

భారంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

కార్పొరేషన్‌లో పనిచేసేవారి కంటే వృథాగా ఉన్నవారే అధికం. గతంలో కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను నియమించారు. వారు పనులు చేయకున్నా ఇంట్లో కూర్చుని జీతాలు తీసుకుంటున్నారు. పదవీ విరమణ పొందినా, అవసరం లేకున్నా వేతనాలు పొందుతున్నారు.

బల్దియా ఖజానా ఖాళీ

కార్పొరేషన్‌కు రావాల్సిన పన్నులు రావడం లేదు. వాటిని వసూలు చేయడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి రోజు రూ.5 లక్షల పన్నులు కూడా వసూలు కావడం లేదు. దీని కోసమంటు ప్రత్యేక టీం లేదు. బిల్ కలెక్టర్లను సైతం మార్చారు. గతంలో ఉన్న రెవెన్యూ అధికారులు లేకపోవడం కూడా లోటే. ఖజానా నిండాలంటే బల్దియాకు రావాల్సిన పన్నులపై దృష్టి పెట్టాలి. మొండి బకాయిలు సుమారు రూ. 50 కోట్ల వరకు ఉన్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్ అద్దెలు కూడా సరిగా వసూలు కావడం లేదు. నామ మాత్రపు అద్దెలు మాత్రమే వసూలు అవుతున్నాయి.

నిధుల లేమితో..

నగరంలో పలు అభివృద్ధి పనులకు మోక్షం కలగడం లేదు. ఇదివరకు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. దీంతో పనులు దక్కించుకున్న గుత్తేదార్లు సైతం పనులు చేయలేమని చేతులెత్తేశారు. కేవలం బల్దియాకు వచ్చే పన్నుల్లోంచే నగర అభివృద్ధికి నిధులు వెచ్చిస్తున్నారు.

ముఖ్యమైన పనులు అలాగే ఉన్నాయి. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.వంద కోట్ల నిధులు కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పలుమార్లు సీఎంకు విన్నవించినా నిధులు మంజూరు కాలేదు. దీంతో నగర అభివృద్ధి అంతంత మాత్రంగా ఉంది. ఈ అంశంపై చర్చకు వచ్చే అవకాశం ఉంది.

చర్యలు తీసుకోవాలి

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బల్దియాలో ఇందిరమ్మ కమిటీలను ఇష్టం వచ్చిన వారిని నియమించారు. నగర అభివృద్ధికి తగిన నిధులు సైతం మంజూరు చేయాలి. బల్దియా ఆదాయానికి గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– న్యాలం రాజు, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్

ముఖ్యమైన అంశాలపై చర్చిస్తాం



నగర అభివృద్ధి, ముఖ్యమైన అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తాం. అన్ని అంశాలను చర్చించేందుకు ప్రతి సభ్యుడికి అవకాశం ఇస్తాం. కార్పొరేటర్ల పదవీకాలం ఈనెల 27తో ముగియనుంది. ఇదే చివరి సమావేశం. – ఎస్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

విలీన సభను విజయవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 19న నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘాలు, ఏఐకేఎంఎస్ విలీన సభను విజయవంతం చేయాలని సంఘం నాయకుడు వేల్పూరు భూమయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సభను రైతుకూలీ సంఘం కార్యకర్తలు, రైతులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు బారికేడ్ల అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన 50 బారికేడ్లను ట్రాఫిక్ ఏసీపీ నారాయణకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్సైలు ట్రాఫిక్ సిబ్బంది, మెడికవర్ ఆస్పత్రి హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



ధర్పల్లి: మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అర్హులైన లబ్ధిదారులకు అందించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మాణం చేపట్టినా లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో జాప్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం చొరవ తీసుకొని లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, గంగామణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



ఖలీల్‌వాడి: జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో ఆవిష్కరించారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల కార్యక్రమాల వివరాల కోసమే డైరీ అని ఆమె అభివర్ణించారు. మరచిపోలేని ఎన్నో అనుభూతుల సమాహారం డైరీలో దాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో సుజాత, హరిప్రసాద్, చంద్రశేఖర్, వెంకటలక్ష్మి, అంజల్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీటీయూ ఆధ్వర్యంలో..



నిజామాబాద్ అర్బన్: బీసీటీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాడవేడి వినోద్ కుమార్, రాఘవాపురం గోపాలకష్ణ, కొట్టాల రామకృష్ణ, కై రంకొండ బాబు, నునుగొండ విజయలక్ష్మి, అంబటి నర్సయ్య, రమణ స్వామి, గంగోనె సంజీవ్, రఘువీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



నిజామాబాద్ రూరల్: జిల్లా పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిజ్జు దత్తాద్రి, దీకొండ యాదగిరి, పుల్లం హన్మాండ్లు, గుడ్ల భూమేశ్వర్, గుజ్జేటి వెంకట్ నర్సయ్య, తస్నీర్ శ్రీనివాస్, బండి నరహరి, కొండ గంగచరణ్, గంగుల రాజేందర్, ఇరుముల శివలింగం, పుల్లం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆదె ప్రవీణ్

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలో దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆదె ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కబ్జాదారులు మున్సిపల్, తహసీల్ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బందిని మచ్చిక చేసుకొని అక్రమంగా అర్హులైన వారి ప్లాట్లను కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. తన ప్లాట్లకు చెందిన అన్ని స్థలాల్లో కబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పైసా ఎల్లయ్య, ఈర్ల శేఖర్, తుమ్మ నాగభూషణం, వేముల దేవీదాస్, స్వర్గం రమేశ్, పాశకంటి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి


మహాగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: నగరంలో సంకష్టహర చతుర్థిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీసార్వజనిక్ గణేశ్ మండలి గణపతి ఆలయంలో, బొడ్డెమ్మ చెరువు వద్ద ఉన్న శ్రీమహాగణపతి ఆలయంలో,గాయత్రినగర్‌లో ఉన్న శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయంలో,మున్సిపల్ వద్ద ఉన్న శుభం కరోతి గణపతి ఆలయంలో, శ్రీసాయికృప షిరిడినగర్‌లో ఉన్న శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.


శుభం కరోతి గణపతి ఆలయంలో..


గాయత్రినగర్‌లోని సిద్ధివినాయక ఆలయంలో..

సొంత పార్టీ నాయకులపై విమర్శలు తగవు


సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా, నాయకులు

వర్ని: కాంగ్రెస్ పార్టీలో ఉండి పార్టీ ఎమ్మెల్యేను, నాయకులను విమర్శించడం ఎంతవరకు సమంజసమని వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డిపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్‌పై, నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఖండించాల్సింది పోయి సొంత పార్టీ నాయకులను విమర్శించడం తగదని అన్నారు. పార్టీలో ఉండి పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై విమర్శలు చేస్తే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రణజా నాయక్, నారోజీ గంగారాం, సాయిబాబా, శ్రీనగర్ రాజు, వీర్రాజు, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను సాధించుకుందాం


మాట్లాడుతున్న మచ్చ దేవేందర్

బోధన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణను సాధించుకుందామని మాదిగ రాష్ట్ర కళామండలి రాష్ట్ర కో–ఆర్డినేటర్ మచ్చ దేవేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి కళాబృందం రథయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వేయి గొంతుకల మహాసభను విజయవంతం చేయడానికి రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 58 మండలాల్లో కళాబృందం రథయాత్ర సాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 23 న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ఉమ్మడి జిల్లాల సన్నాహక సదస్సుకు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభను మాదిగలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూమన్న, నల్ల మహేందర్, డప్పు సంతోష్, రాంపూర్ సాయి, నవీన్, డల నర్సింగ్, గోనె మారుతి, తాడెం అబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నెలవారి మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–1, 2, 3 ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, వీరేశం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. నగరంలోని పవర్‌హౌస్, మిర్చి కంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం(పి), దుబ్బ, ముబారక్‌నగర్, అర్సాపల్లి ఉప కేంద్రాలతోపాటు హమాల్‌వాడి, ఎల్లమ్మగుట్ట, పోలీస్‌లైన్, ప్రభుత్వ ఆస్పత్రి, రైల్వేస్టేషన్, వైద్య కళాశాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బోర్గాం(పి) శివారులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో కూడా మరమ్మతులు ఉంటాయన్నారు. విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు హైదరాబాద్‌లో మహాసభ

నిజామాబాద్ రూరల్: తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తుల మారుతి, పల్ల మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభను రైతు కూలీలు, మేధావులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు వచ్చే నెల 28 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సంచార చేపల వాహనానికి..

ఇందల్వాయి: సంచార చేపల వాహనాన్ని రాయితీపై పొందేందుకు ఆసక్తి ఉన్న గంగపుత్రులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సువర్ణ పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు మహిళ సమాఖ్య ద్వారా రాయితీ అందిస్తామని అన్నారు. వాహనం విలువ రూ. పది లక్షలు కాగా రూ. ఆరు లక్షల రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. దీంతో పాటు క్యాంటీన్ నిర్వహణపై ఆసక్తి ఉన్న మహిళలకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి క్యాంటీన్ ఏర్పాటుకు సహకారం అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఇందల్వాయి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గుంతలు పూడ్చిన బీఆర్‌ఎస్ నాయకులు



నిజామాబాద్ రూరల్: సారంగాపూర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డును 13వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అక్బర్ నవాజుద్దీన్ సొంత ఖర్చులతో కంకర, మట్టితో పూడ్చివేశారు. రాత్రి వేళ ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు గుంతలుగా ప్రాంతాలను పూడ్చివేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి బోధన్ వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆర్మూర్‌టౌన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1,3 5వ సెమిస్టర్ పరీక్ష ల ఫీజును ఈనెల 30లోగా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుముతో ఫిబ్రవరి 10వ తేది వరకు రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ సిటీ: నగరంలో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అధికారులు, కంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం నగరంలోని 35, 36, 37, 43 డివిజన్లలో చేపట్టే సీసీ డ్రయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ నీతూకిరణ్‌తో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధీర్, మాస్టర్ శంకర్, ఉమారాణి, ముత్యాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


దూస్‌గాంలో క్షేత్రస్థాయి సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో


డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో..


మోపాల్: వడ్డెర కాలనీలో

డిచ్‌పల్లి/ మోపాల్/ నిజామాబాద్ రూరల్/ ధర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా అర్హుల లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల సర్వేను అధికారులు శుక్రవారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం దూస్‌గాంలో నిర్వహిస్తున్న సర్వేను నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ పరిశీలించారు. రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నంబర్ల వారీగా క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా నిర్ధారిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలకు రేషన్‌కార్డులను అందించేందుకు ఇంటింటి పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వేను మండల ప్రత్యేకాధికారి యోహాన్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇంటింటికి తిరిగి పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మోపాల్ మండలం తాడెం, వడ్డెర కాలనీ, సింగంపల్లి, బాడ్సి, కాస్‌బాగ్ తండా, తదితర గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో రాములు నాయక్ పరిశీలించారు. సకాలంలో సర్వే పూర్తి చేసేలా సిబ్బంది తగిన ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని రాంనగర్‌లో కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వేను రూరల్ ఎంపీడీవో రామ్‌నారాయణ పరిశీలించారు. అనంతరం మండల స్పెషల్‌ఆఫీసర్ రాజేందర్ రేషన్‌కార్డుల పరిశీలన చేసినట్లు తెలిపారు. ధర్పల్లి మండలంలోని డీబీ తండా, దుబ్బాకతో పాటు పలు గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. పంటల సాగుకు యోగ్యంగా లేని అన్ని రకాల భూములపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు.


రాంనగర్‌లో..


ధర్పల్లి: డీబీ తండాలో..

మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌లో పీవో డబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు సాయాగౌడ్, సాయిబాబా, మహేశ్, రాజు, భాగ్యలక్ష్మి, సువర్ణ, రాజమణి, లక్ష్మి, సుజాత, గంగామణి, జమున తదితరులు పాల్గొన్నారు.



బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,100	వెండి(కిలో)	95,500
22 క్యారెట్స్	74,830	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	70	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	20	40	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.25, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35 డాకు మహారాజు(తెలుగు)-4.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40 ఎమర్జెన్సీ(హిందీ)-4.30
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40 ఎమర్జెన్సీ(హిందీ)-10.00
స్క్రీన్ -4	ఎమర్జెన్సీ(హిందీ)-12.00 ఆజాద్(హిందీ)-3.05, 10.15 పుష్ప-02(తెలుగు)-6.10
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)